సర్కారు మారినా.. సమస్యలు తీరలె..

- అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల వేతనం అంతంతే
- ఏడాదిగా అమలుకాని వేతన పెంపు
- ప్రభుత్వ ఉద్యోగి గుర్తింపు, పదోన్నతి ఊసే లేదు


మంత్రి సీతక్కకు వినతిపత్రమిస్తున్న అంగన్‌వాడీటీచర్లు


పెద్దపాపయ్యపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పాఠాలు చెబుతున్న టీచర్

హుజూరాబాద్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సమస్యలతో సతమతమవుతున్నారు. చాలీచాలని వేతనం, ఉద్యోగ విరమణ తర్వాత పింఛన్, ఏళ్లుగా సేవ చేస్తున్నా ప్రభుత్వ ఉద్యోగిగా గుర్తింపు శూన్యం. అధికారంలోకి వస్తే వేతనాలు పెంచుతామని అధికారం చేపట్టిన కాంగ్రెస్ పాలన ఏడాది గడిచినా సమస్యలు తీరడంలేదనే ఆందోళనలో ఉన్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు తీర్చాలని వేడుకుంటున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 246 అంగన్‌వాడీ కేంద్రాల్లో 232 మంది టీచర్లు, హెల్పర్లు, 12300 మంది పిల్లలు ఉన్నారు.

అమలుకాని హామీ

అంగన్‌వాడీ టీచర్లకు రూ.11850, హెల్పర్లకు రూ.7,800 వేతనం అందుతోంది. గౌరవ వేతనం రూ.26 వేలకు పెంచుతామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రకటించినా హామీ అమలు కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ఉద్యోగ విరమణ తర్వాత టీచర్‌కు రూ.రెండులక్షలు, హెల్పర్‌కు రూ.లక్ష బెనిఫిట్ ఇవ్వనున్నట్లు కాంగ్రెస్ సర్కారు ప్రకటించింది. హామీ అమలుకావడం లేదనే వాదనలు వినిస్తున్నాయి. పదోన్నతి కల్పిస్తే టీచర్లు సూపర్‌వైజర్లు, అర్హత ఉన్న హెల్పర్లు టీచర్లు అవుతారు. ఈ ప్రక్రియ రెండేళ్లకోసారి జరగాల్సి ఉంటుంది. కానీ పదేళ్లుగా పదోన్నతి ప్రస్తావన లేదు. దీంతో వయోపరిమితితో టీచర్లు, హెల్పర్లు పదోన్నతి అర్హత కోల్పోతున్నారు. రెండేళ్లకోసారి పదోన్నతులు కల్పిస్తే టీచర్లు, హెల్పర్లకు ప్రయోజనం కలుగుతుంది. రిటైర్‌మెంట్ తర్వాత పింఛన్ కల్పనపై ప్రభుత్వం స్పందించడం లేదని టీచర్లు, హెల్పర్ల ఆవేదన చెందుతున్నారు. కొన్నిచోట్ల పింఛన్‌కు అర్హులుగా నమోదు చేస్తున్నారని ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్న టీచర్లు, హెల్పర్లకు ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చాలని డిమాండ్ చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



సీఎం రేవంత్‌రెడ్డి సమస్యలు పరిష్కరిస్తారనే ఆశతో ఉన్నాం. టీచర్లకు రూ.26 వేలు, హెల్పర్లకు నిబంధనల మేరకు వేతనం పెంచి ఆదుకోవాలి. ఉద్యోగ విరమణ తర్వాత టీచర్‌కు రూ.ఐదు వేలు, హెల్పర్‌కు రూ.మూడేవేల పింఛన్ ఇవ్వాలి. వైద్య ఖర్చులు భరించలేక అనారోగ్యంతో మృతి చెందుతున్నారు. ప్రభుత్వం హెల్త్ కార్డులు జారీ చేసి ఆదుకోవాలి. – బండి ఉషారాణి, అంగన్‌వాడీ టీచర్స్ హుజూరాబాద్ డివిజన్ అధ్యక్షురాలు

చాలీచాలని వేతనం



అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు తీరిక లేకుండా విధులు నిర్వహిస్తున్నాం. చాలీచాలని వేతనంతో జీవనం కొనసాగిస్తున్నాం. వచ్చే జీతం సరిపోక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి. – కోటోజు జ్యోతిరాణి, అంగన్‌వాడీ టీచర్, హుజూరాబాద్

బాల్య వివాహాలను అరికట్టాలి


మాట్లాడుతున్న ఇస్రత్ సుల్తానా


శంకరపట్నం: పోషక విలువలు వివరిస్తున్న అధికారులు

తిమ్మాపూర్: బాల్య వివాహాలను అరికట్టాలని కరీంనగర్ రూరల్ సీడీపీవో శ్రీమతి సూచించారు. మొగిలిపాలెంలోని ఇస్లాంనగర్అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం సభ నిర్వహించారు. సూపర్‌వైజర్ పద్మ, పల్లె దవాఖాన డాక్టర్ పుల్లారావు, సీడీపీవో మాట్లాడారు. తల్లులు పిల్లలు తీసుకోవాల్సిన ఆహారం, కిచెన్ గార్డెన్ ప్రాముఖ్యత గూర్చి వివరించారు. కేంద్రం ఆవరణలో మునగ, నిమ్మ, కరివేపాకు మొక్కలు నాటారు. తల్లులు వినియోగించుకోవాలని తెలిపారు. బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఏఎన్‌ఎం విజయ, ఆశాలు పద్మ, పుష్ప అంగన్‌వాడీ టీచర్లు సౌజన్య, మమత, మహిమ, కిషోర బాలికలు పాల్గొన్నారు.

మానకొండూర్: పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇస్రత్ సుల్తానా అన్నారు. గన్నేరువరం మండలం గోపాల్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సభలో పౌష్టికాహారం, తల్లిపాల ప్రాముఖ్యత వివరించారు. ఆరోగ్యవంతమైన దేశం గర్భిణులు తీసుకునే పౌష్టికాహారంపై ఆధారపడిఉంటుందన్నారు. పుట్టిన బిడ్డకు ఆరునెలల వరకు తల్లిపాలు పట్టాలన్నారు. ఆరోగ్య మహిళను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యదర్శి కిరణ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్ సునీత, తల్లులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం, చింతలపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారంసభ నిర్వహించారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పోషక పదార్థాల గూర్చి ఐసీడీఎస్ అధికారులు అవగాహన కల్పించారు. గర్భిణులకు సీమంతం చేశారు. మండల ప్రత్యేక అధికారి నాగార్జున, ఎంపీవో ప్రభాకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కవిత, స్రవంతి, అంగన్‌వాడీటీచర్లు, వైద్యులున్నారు.

ట్రాన్స్‌కో అధికారుల పొలంబాట


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చొప్పదండి: మండలంలోని కాట్నపల్లి గ్రామంలో ట్రాన్స్‌కో అధికారులు శుక్రవారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మోటార్ల వద్ద వైర్ కనెక్షన్లపై అవగాహన కల్పించారు. కెపాసిటర్లు, స్టాటర్ల మరమ్మతులను వివరించారు. కార్యక్రమంలో కరీంనగర్ ట్రాన్స్‌కో ఆపరేషన్స్ విభాగం, గంగాధర సబ్ డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ



చొప్పదండి: పట్టణంలోని రైస్‌మిల్లుల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు లయన్స్‌క్లబ్ సభ్యులు శుక్రవారం దుప్పట్ల పంపిణీ చేశారు. దాత తొడుపునూరి లక్ష్మయ్య సహకారంతో 30 మందికి దుప్పట్లు అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మహేశుని మల్లేశం, కోశాధికారి తొడుపునూరి సత్యనారాయణ, కొల్లూరి ఆనందం, జితేందర్, మాదూరి శ్రీనివాస్, నలుమాచు సుధాకర్, వల్లాల జగన్, సిరిపురం రాజు, తాటిపెల్లి అంజయ్య, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ర్యాలీలో సమ్మయ్య

శంకరపట్నం: ఒడిశా రాష్ట్రంలో శుక్రవారం నిర్వహించిన ఏఐటీయూసీ ర్యాలీలో మండలం కొత్తగట్టు గ్రామానికి చెందిన బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిట్టల సమ్మయ్య పాల్గొన్నారు. అనంతరం ఏఐటీయూసీ జాతీయ కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం


విరాళం అందిస్తున్న దాతలు

చొప్పదండి: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయంలో అన్నదాన ట్రస్టుకు ఎలబోతారం గ్రామానికి చెందిన చల్ల కవిత, చంద్రారెడ్డి దంపతులు శుక్రవారం రూ.18,116 విరాళం ప్రకటించారు. ఈమేరకు ఆలయ చైర్మన్ బొడిగె వెంకటేశ్‌గౌడ్‌కు దాత కుమారుడు చల్ల శివారెడ్డి విరాళం అందించారు. ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి సత్యానందం, ఉపాధ్యక్షులు మునిందర్, రాములు, సుధాకర్ గౌడ్, సభ్యులు బొద్దుల వెంకన్న, గుర్రం శ్రీనివాస్ రెడ్డి, పిట్టల సురేశ్, పిల్లి సాయిచంద్, తదితరులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

మానకొండూర్: మానేరుపై బ్రిడ్జి హామీని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ త్వరలో నెరవేరుస్తారని బ్రిడ్జి జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్ కుమార్ అన్నారు. శుక్రవారం కేంద్రమంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు గన్నేరువరంలో క్షీరాభిషేకం చేశారు. గన్నేరువరం నుంచి కరీంనగర్ వరకు బ్రిడ్జి నిర్మించాలని కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీని బండి సంజయ్ కోరడంపై హర్షం వ్యక్తం చేశారు. త్వరగా నిధులు మంజూరు అయ్యేలా కృషి చేయాలని, ప్రజల ఆకాంక్ష నెరవేర్చాలన్నారు. రాజకుమార్, కృష్ణ, నరసయ్య, అనిల్, నవీన్, అనిల్, అంజయ్య పాల్గొన్నారు.

యువతకు అవకాశమివ్వాలి

హుజూరాబాద్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేసిన యువకులకు రాబోయే పంచాయతీరాజ్ ఎన్నికల్లో అవకాశం కల్పించాలని నియోజకవర్గ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ మిడిదొడ్డి రాజు అన్నారు. శుక్రవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం యువకులకు ఎక్కువ అవకాశాలు కల్పించాలని పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. పార్టీ విజయం కోసం అహర్నిశలు శ్రమించిన వారిని గుర్తించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

వీణవంక: మండలంలోని బేతిగల్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ సురేశ్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మధ్యాహ్నం మూడు గంటల నుంచి నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

జమ్మికుంట: పట్టణంలోని హౌజింగ్ బోర్డు, మసీద్, దుర్గాకాలనీ, పంచముఖ హన్‌మాన్, మోత్కులగూడెం, అంబేడ్కర్‌కాలనీ, పాత మార్కెట్ ఏరియాల్లో విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం రెండుగంటల వరకు కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు, వర్తక, వాణిజ్య వ్యాపారులు సహకరించాలని టౌన్ ఏఈ అనంద్ శుక్రవారం తెలిపారు.

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్, కాచాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల దృష్ట్యా కరెంట్ సరాఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆముదాలపల్లి ఏఈ రఘు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నామని, మొలంగూర్, మొలంగూర్ ఇండస్ట్రియల్ ఏరియా, చింతలపల్లి, నల్లవెంకయ్యపల్లి, గుడాటిపల్లి, కాచాపూర్, రాజాపూర్, గద్దపాక, కల్వల గ్రామాల్లోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

నూతన పీఆర్‌సీ ప్రకటించాలి

హుజూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు నూతన పీఆర్‌సీని ప్రకటించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్, గౌరవాధ్యక్షుడు కట్ల నాగభూషణాచారి శుక్రవారం ప్రకటనలో కోరారు. జనవరి 2023 నుంచి జూలై 2024 వరకు పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కుబేర్‌లో పెండింగ్ మెడికల్ రియింబర్స్‌మెంట్ బిల్లులతో పాటు అన్నిరకాల పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలన్నారు.

దిష్టిబొమ్మ దహనం



రామడుగు: అసెంబ్లీలో మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎమ్మెల్యే గంగుల కమలాకర్ వ్యాఖ్యలను నిరసిస్తూ మండల కేంద్రంలో శుక్రవారం యువజన కాంగ్రెస్‌పార్టీ నాయకులు గంగుల దిష్టిబొమ్మను దహనం చేశారు. యువజన కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వినయ్, రామడుగు మండల అధ్యక్షుడు అనుపురం పర్శరాంగౌడ్, ఉపాధ్యక్షుడు పవన్, నాయకులు మామిడి దిలీప్‌కుమార్, అక్షయ్, రాజశేఖర్, పూరెల్ల రాహుల్, అజయ్, విజయ్ పలువురు పాల్గొన్నారు.

పరామర్శ

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామ బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడు పూడూరి బాలరాజు గుండె సంబంధిత చికిత్స పొంది ఇంటికి రాగా మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శుక్రవారం ఆయనను పరామర్శించారు. కార్యక్రమంలో కొండగట్టు దేవస్థానం మాజీ డైరెక్టర్ దాసరి రాజేందర్‌రెడ్డి, నాయకులు పూడూరి మల్లేశం, రేణికుంట అశోక్ పలువురు పాల్గొన్నారు.

హుజూరాబాద్: మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంపత్ తల్లి సమ్మెట నాగమ్మ శుక్రవారం మృతిచెందగా ఆమె కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సొల్లుబాబు పరామర్శించారు. ఈ సందర్భంగా మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకొనిసానుభూతి, సంతాపాన్ని వ్యక్తం చేశారు. వెంట మహిళా కాంగ్రెస్ నాయకులు లంక దాసరి లావణ్య, పుల్ల రాధ, దుబాసి స్వరూప, స్నేహలత, రేణుక, సొల్లు సునీత, తదితరులు ఉన్నారు.



రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట బస్టాండ్ సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం సమీపంలో నెల రోజులుగా తాగు నీటి పైపులైన్ లీకేజీ అవుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. లీకేజీతో తాగునీరు కలుషితమవుతోందని, ఇకనైనా స్పందించి లీకేజీకి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
ప్రకాశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, రామడుగు, సెల్ నంబర్: 79956 60658

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

రైతులకు అవగాహన


రోటరీ మల్చర్‌పై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ, ఏవో, కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్

జమ్మికుంట: వరికొయ్యలు కాల్చివేతతో జరిగే నష్టాలపై వ్యవసాయ అధికారులు కేశవపూర్ గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. 'వరికొయ్యలు కాల్చొద్దు' అనే కథనం బుధవారం 'సాక్షి'లో ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. వరికొయ్యలను కంపోస్టుగా మార్చడం హుజూరాబాద్ ఏడీఏ సునీత, జమ్మికుంట ఏవో ఖాదర్ హుస్సేన్, కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్ వివరించారు. రోటరీ మల్చర్ పరికరం కొయ్యలు చిన్నచిన్న ముక్కలుగా చేస్తుందని, పొలం కలియదున్ని ఎకరాకు యాభై కిలోల సూపర్‌ఫాస్ఫేట్ చల్లడం వల్ల ఎరువుగా మారి పంటలకు లాభం చేకూరుతుందన్నారు. అంతేకాకుండా కేవీకేలో రోటరీ మల్చర్ చేసుకునేందుకు పరికరాన్ని ఎలాంటి రుసుం చెల్లించకుండానే రైతులకు అందుబాటులో ఉంటుందని శాస్త్రవేత్తలు తెలిపారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు మహేందర్, అచ్యుత్, రాంప్రసాద్, రాజేశ్‌పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గ సభ్యులు

తిమ్మాపూర్ ప్రెస్‌క్లబ్ కార్యవర్గం


బత్తుల రాకేశ్

తిమ్మాపూర్: తిమ్మాపూర్ మండలం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా బత్తుల రాకేశ్ నియామకమయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నికల నిర్వాహకులు మునుకు లక్ష్మారెడ్డి, సిరిసిల్ల అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని శ్రీతాపాల లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆవరణలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. . గౌరవ అధ్యక్షుడిగా మునుకు లక్ష్మారెడ్డి(మహాన్యూస్), గౌరవ సలహాదారుడిగా వేల్పుల రాజు (నమస్తే తెలంగాణ) అధ్యక్షుడిగా బత్తుల రాకేశ్(సాక్షి), ఉపాధ్యక్షులుగా నాగేల్లి ఆంజనేయులు(హెచ్‌ఎం టీవీ), ఎండీ రహీమొద్దీన్(బిగ్ టీవీ), ప్రధాన కార్యదర్శిగా బొట్టు శ్రీనివాస్(టీవీ 5), కోశాధికారిగా బెజ్జంకి ఆంజనేయులు(నవ తెలంగాణ), సంయుక్త కార్యదర్శులుగా కొంపెల్లి సతీశ్(ఎన్ టీవీ), భూమాడి శ్రీధర్‌రెడ్డి(నమస్తే తెలంగాణరూరల్), ప్రచార కార్యదర్శిగా జాప నాగరాజు(చురకలు), కార్యవర్గ సభ్యులుగా బొమ్మిడి విజయకుమార్(మన తెలంగాణ), గోనె విష్ణువర్ధన్(ఆంధ్రప్రభ), కొమ్మెర రాజిరెడ్డి(99టీవీ) ఎన్నికయ్యారని లక్ష్మారెడ్డి, అనిల్‌కుమార్(ప్రైమ్ 9 టీవీ) ప్రకటించారు. అనంతరం నూతన అధ్యక్షుడు బత్తుల రాకేశ్ మాట్లాడారు. మండలానికి చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకర్లకు ఇళ్ల స్థలాలు, సంక్షేమం చేకూర్చడంతోపాటు సమస్యలను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, జిల్లా యూనియన్ నాయకుల సహకారంతో షరిష్కరిస్తానని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

చిగురుమామిడి: కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు పర్శరాములు ఆధ్వర్యంలో నాయకులు కేంద్రహోం మంత్రి అమిత్‌షాపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పార్లమెంటులో అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలకు తక్షణం ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని ఎస్సైకి విన్నవించారు.

వీణవంక: అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని హితవు పలికారు.

చొప్పదండి: అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేశ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని కార్యాలయంలో నాయకులతో కలిసి మాట్లాడారు. అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఏవైఎస్ నాయకులు నిరసన చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం శారు.

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి లో డీఎస్పీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.

ఇల్లందకుంట: బీఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా పార్టీ మండల నాయకుడు వంగరామకృష్ణ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

ఫార్ములా ఈ రేసులో అవినీతి జరగలేదు

గంగాధర: ఫార్ములా ఈ రేసులో ఎటువంటి అవినీతి జరగలేదని, ప్రభుత్వం నిరూపించాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. మండలంలోని మధురానగర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఫార్ములా ఈ రేసులో నిబంధనల ప్రకారమే నిధులు చెల్లించారని రేసు వల్ల రూ. ఏడువందల కోట్ల నిధులు తెలంగాణకు వచ్చాయన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించడానికి, మాజీ మంత్రి కేటీఆర్‌పై కక్ష్య సాధింపు కోసమే కేసు పెట్టారని విమర్శించారు. ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, వెంటనే హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కేటీఆర్‌పై కేసు హేయమైన చర్య

హుజూరాబాద్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేసు హేయమైన చర్య అని బీఆర్‌ఎస్ యూత్ నియోజకవర్గ ఇన్‌చార్జి తొగరు శివకృష్ణ శుక్రవారం ఖండించారు. సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ తుగ్లక్ పాలన సాగిస్తున్నారని, ఆరు గ్యారంటీలులు అమలు చేయలేక ప్రతి పక్ష నేతలపై తప్పుడు కేసులు బనాయించి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం విధానాలను ప్రజలు గమనిస్తున్నారని, గుణపాఠం తప్పదన్నారు.

కుటుంబ సభ్యులకు యువతి అప్పగింత

హుజూరాబాద్ : మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని పోలీసులు గురువారం అర్ధరాత్రి కుటుంబ సభ్యులకు అప్పగించిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఓ యువతి, యువకుడు హైదరాబాద్‌లో వివాహం చేసుకొని హుజూరాబాద్ బస్టాండ్‌కు వచ్చారు. యువకుడిని కుటుంబ సభ్యులు వెంట తీసుకెళ్లడంతో యువతి ఒంటరైంది. గురువారం అర్ధరాత్రి పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు యువతి తారసపడటంతో వివరాలు తెలుసుకొని గ్రామానికి తీసుకెళ్లి అప్పగించారు.

క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న కంది తిరుపతిరెడ్డి

చిగురుమామిడి: మండలంలోని కొండాపూర్ కాశవాడ ప్రాథమిక పాఠశాలలో అభివృద్ధి పనులకు శుక్రవారం హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ చిగురుమామిడి అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద మంజూరైన నిధులతో ప్రహరీ, టాయిలెట్స్ నిర్మించనున్నామని తెలిపారు. పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మల్లేశం, గ్రామ ప్రత్యేకాధికారి నిరంజన్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి సత్యనారాయణరెడ్డి మండల ఉపాధ్యక్షుడు నరేందర్‌సింగ్, సుందరగిరి, నవాబుపేట్ గ్రామాల అధ్యక్షులు లక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు షాబుద్దీన్, రెడ్డి యాదగిరి, దిలీప్‌సింగ్, మాతంగి సతీశ్, సంతోశ్‌రెడ్డి, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డిని నాయకులు ఘనంగా సన్మానించారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వినతి

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని శుక్రవారం తహసీల్దార్ రమేశ్‌కు పిడిశెట్టి రాజు వినతిపత్రం ఇచ్చారు. స్పీడ్ బ్రేకర్లు లేనందున వాహనాలు వేగంగా వెళ్తున్నాయని ఇటీవల జరిగిన రెండు ప్రమాదాలను వివరించారు. తహసీల్దార్ సానుకూలంగా స్పందించి స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు హామీ ఇచ్చారని రాజు తెలిపారు.

వాటర్ ప్యూరిఫయర్ బహూకరణ


వాటర్ ప్యూరిఫయర్‌ను ప్రారంభిస్తున్న మహేశ్

చొప్పదండి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు వాటర్ ప్యూరిఫయర్‌ను ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేశ్ శుక్రవారం బహూకరించారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించేందుకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచనల మేరకు వాటర్ ప్లాంట్ మంజూరు కాగా మహేశ్ ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పెరుమాండ్ల గంగయ్య గౌడ్, మాచర్ల మంజుల, చిలుముల స్వప్న, హెచ్‌ఎం శ్రీనివాస్, టీచర్లు పాల్గొన్నారు.

కరాటేలో బంగారు పతకాలు


బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు

మానకొండూర్: గన్నేరువరం మండలం గుండ్లపల్లిలోని ఎస్‌ఎల్‌ఎన్ స్పార్కిల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. ఈ నెల 8న నాల్గో రాష్ట్రస్థాయి పోటీలు మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట్‌లో డ్రాగన్ స్క్వాడ్ కుంగ్‌ఫూ అకాడమీ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. యు.నాగశివ (ఏడో తరగతి), మోక్షిత, హరిప్రియ (మూడో తరగతి) వివిధ కేటగిరీల్లో పతకాలు సాధించగా విద్యార్థులను ప్రిన్సిపాల్ ఆంజనేయులు, కరస్పాండెంట్ సంపత్, అకాడమిక్ డైరెక్టర్ పి.సతీశ్, కరాటే మాస్టర్ ఎలగందుల శ్రీనివాస్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వీణవంక: మండలంలోని చల్లూరు బస్టాండ్ వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీ కొనడంతో పరమేశ్వర్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. అరుణ్‌కుమార్ అనే వ్యక్తి కారును అజాగ్రత్త, అతివేగంతో నడుపుతూ బైక్‌ను ఢీకొన్నాడని, పరమేశ్వర్ తల్లి స్వరూప ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వీణవంక: మండలంలోని చల్లూరు, కోర్కల్ మానేరువాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్లు, ఓనర్లపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను ఠాణాకు తరలించామని, అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.